అక్రమవిభాగము

పిమ్మరాజు రాజగోపాలముగారు బి.యె. సారస్వతసమాజము

౧

క్రొత్తగాచేయించుకొన్న తనముద్దుల రాట్నానికి పక్కగా బుల్లిపీట వేసుకొని దాని మీదకూచొని నూలుతీస్తోంది శేష. ఎదురుగుండా ఒకచిన్న రౌనుబల్లవుంది. దానిమీద వున్న బిగ్బెన్‌గడియారము టిక్కుటిక్కుమంటోంది. గిఱ్ఱునతిరుగుతోవున్న రాటపు చక్రము భావిభారత భాగ్యాన్నిగూర్చె కాబోలు ఒక్క ఆశామహితగీతం తనవ్యూహాతుషితరాగాన యేకాలాపనచేస్తోంది. ఇతరమైన సవ్వడియ్యేదీలేదు.

ఆగది కిటికీలోనుంచి సమీరకుమారుడు తప్పటడుగులతో ప్రవేశించి కొంతసేపామె ఖద్దరుచీరచెఱగు కదలించాడు. వెనక్కైనా తిరిగిచూడకుండా ఆమెపనిలో లీనమైవున్నది. గుబురులుగుబుర్లుగా ముఖసీమను వ్రాలే నీలాలకాలు కదలించి తొంగిచూస్తే అక్కడ భావనాతరంగాలు మాత్రమే పోటుపాటు చేస్తున్నాయి.

కొంతసేపటికామె యోచనాపూరితసుందరవదనం పయికెత్తిచూచింది. అప్పటికప్పుడే గడియారపుముల్లు తొమ్మిదిమీదికిపోయింది. వెంటనే లేచి బల్లమీదవుంచిన గ్లాసులో వేలుపెట్టి చూచింది. అందులో కాఫీచల్లారిపోయివుంది. "ఎంచేతో యింకారాలేదు? పొద్దున్నఅనగా వెళ్లారు" అని తామరమొగ్గలాటి తనకెంపుఅరచేయి ముకుళించి చూపుడువేలుతో పొటమరించిన తనలేగులాబీబుగ్గ నదుముకుంటూ మళ్లీ ఆలోచనలోపడింది. ఇంతలో వీథిగుమ్మంలో యెవ్వరో రాక్షసిగొంతుకతో "పూర్ణచంద్రావుగారూ!" అని అరుస్తూన్న ధ్వని వచ్చింది. అదివిని "ఎవరువారూ?" అని శేష సింహద్వారం చెంతకివచ్చింది.

వీథిగుమ్మందగ్గర ఒకనల్లటి లావైనమనిషి నుంచున్నాడు. తలకట్టులేని 'గా'లావుంది వానిజుట్టు కత్తిరింపుమాదిరి. చేతిలో వలమైన ఒకవేముకఱ్ఱ వంకరదివుంది. మంచి ముతకరకం ఖద్దరుచొక్కా బొంతలాంటిపంచీ కట్టుకున్నాడు. ఆయనతోపాటు ఇంకో ఆయనగుమాస్తో, నౌకరో కూడా నుంచున్నాడు. గద్దరిగాడితో యుద్ధానికి సాయపడే గొడ్డుకోతిలావున్నాడారెండోఆయన. శేషనిచూడగానే మొదటాయన "లేసుటమ్మా! యింట్లో లేడూ, మమ్మల్ని చంపేస్తున్నాడు, మాప్రాణాలు తోడేస్తున్నాడు, తిరగలేకచచ్చిపోతున్నానుఇల్లంతా దోచిచ్చానే. ముందుగుమ్మరించానే. ఏడువేలు. ఒకటా, రెండా. ఇస్తారా? ఏమిటిచ్చేదీ నామొహం, ఆయనమొహం. ఎప్పుడురావడం ఆయన" ఏకథాటీని ఖడ్గమృగానికి మల్లే మొదటిఆయన గొంద్రించాక ఆయనగుమస్తా సర్కసుకోతిలాగు ఆయననుకరించాడు.

అదంతావింది శేష. హృదయంజల్లుమంది. ఒకవిచారతరంగం పైడలుతరంగమై పొంగివచ్చింది. ముఖంజేవురించింది. ఉదారగుణవిద్యాసుందరుడైన తనభర్తననే మాటలు వినలేకపోయింది. "లేరు పొమ్మ"ని వాళ్లవెన్నుమీద తలుపు దడాలుమనిపించి యింట్లోకిపోయింది

౨

రెండుగంటలు కావచ్చింది. పూర్ణచంద్రరావు మంచంమీద శయనించి, తలమాత్రం పైకెత్తి కూర్చున్నట్టుగానున్నాడు. ఎదురుగావున్న పేముసోఫామీదకూర్చుండి తమలపాకు లిస్తోంది శేష.

పూర్ణచంద్రరావుది లేతనలుపుశరీరం. చక్కని ఎగదువ్వుడు క్రాపు. విశాలమైన నుదురూ, వక్షస్థలమూ; సన్నటినడుమూ మనిషిరూపసే అనిపిస్తాయి. పైపెదవి చిక్కని భిగీ, విశాలనేత్రాలలోని చాపల్యమూ, ఔదార్యాదిగుణసమూహాని కట్టడుగున అంతర్వాహినిగావచ్చే భావోద్రేకస్వభావాన్ని కూడా తెలియజేస్తాయి. అతనికివున్న సంపూర్ణవిద్యాసంస్కారం శరీరానికి మంచి నాజూకు తీసుకువచ్చి విద్యావంతులకుండే యేదోశోభ చూపిస్తుంది.

శేషకూడా చక్కనిదనే చెప్పాలి. ఎఱుపుడవులుకల చామనచాయ. నెమ్మేనిలో హృదయపావిత్ర్యం తెలియజేసే కాంత్యుజ్వలత వుంది. అది ఆమె సుందరవదనంలో చాలా బాగాకనిపిస్తుంది. విశాలనయనాలు సుశోభాప్రపూర్ణాలు కాని యీమధ్య పొందుచున్న మనోదుఃఖంవల్ల జడాలసములుగానున్నవి. కాని నిరాడంబరమైన ఆమె అలంకారము లోకవిధముగువన్నె చేకూరుస్తున్నాయి. మెడలో ఒకగొలుసు, చేతులకి రెండుమూడు జతలు గాజులు, స్వయంగావడికిననూలుతో తాను నేయించుకొన్న ఖద్దరుచీర, జాకెట్టు, ఆమె జీవితాన్నిగురించి సంపుటాలు చెప్పుతాయి.

మౌనముద్రసడలించుకొని పూర్ణచంద్రరావు "అయితే యిష్టమొచ్చినట్లల్లా పేలాడన్నమాట, పాపయ్య?" అన్నాడు. వేగముతో దానికి

శేష

ఏదోపేడిశాడు లెండి. మనము శాంతమే వహించాలి. ముందీఋణసముద్రంలోనుంచి బయటపడేమార్గం చూడండి.

పూర్ణచంద్రరావు

ఔనే మరియేమిచేయమన్నావు? అవతల మహాత్ముడుచూస్తే పవిత్రమైన వుద్యమం లేవతీసినాడు. ఒకమూల ప్రపంచమంతా ఆరికట్టినది ఆర్థికసమస్య. ఈలాటప్పుడు సర్వత్రా వుదారపురుషులంతా మానవసేవలో లీనమైపోయి దరిద్రసోదరకోటిని వుద్ధరించడానికి సర్వస్వమూ ధారపోస్తూంటే యీవడ్డీ జీవనపు ఘాతుకమృగాలు సోదరకోటిని ఋణగ్రస్థులిని తినెయ్యాలని చూస్తున్నారు. మానవజీవనం త్యాగవిరహితం అయిపోయింది. దురాశాపూరితమైన ఈనరకకోటికంతా ఒకమహాప్రళయం, రక్తప్లావితంచేసే ఒకపెద్దవిప్లవం తప్పకుండా వస్తుంది. ఏమంటావు, శేషూ?

శేష

వచ్చితీరుతుంది. ఎన్నాళ్లు సాగుతుం దీఅక్రమవిభాగం? సోదరమానవుణ్ణి సోదరమానవుడు తినాలనిచూచే యీ ఆర్థికసంబంధం, ఈపెట్టుబడిదారులదురంతికం. ఎవడు నిర్మించాడీవిశాలప్రపంచం? ఆనిఖిలేశుడు సృజించాడీవిశ్వమంతా. మానవులంతా సోదరులు. అందరికి సమానమైన హక్కువుండి

తీరాలి. కష్టించేవాళ్ళు, మేధాసంపన్నుళ్ళు, కళాకుశలుళ్ళు లేమిచేత అల్లాడుతుంటే వారి సత్వమనే దుర్మార్గముచేత ఒకానొకతిండి పోతు, మనుష్యజంతువు, ధనాకర్షణయంత్రము బాగుపడడమా? తప్పదండీ! మీరన్నట్లుగా యీసంఘం ప్రస్తుతం అల్లుకుపోతూ వున్న యీనిరంకుశసంఘం క్రుంగిపోయి తీరుతుంది.

పూర్ణచంద్రరావు

అదెల్లాగూరూఢే. కాని నాసంగతే పాలుపోటంలేదు. ఇదివరకు యకరం రెండువేలు చేసే భూమి యిప్పుడు వెయ్యిరూపాయలకు కూడా మూతిచూసేవాళ్ళులేరు. ఎక్కడెక్కడ ఋణదాతలూ అంతావకటి. వక్కడి హృదయాల్లో గాలించినా దయదాక్షిణ్యమూఅనేవిలేవు. ఎల్లాగోఅల్లాగు భూమి పుచ్చుకోమంటే డబ్బేకావాలిట. ఒకవేళ రాయించుకుంటే అసలు కిమ్మతులో మూడవవంతుకి అడుగుతున్నారు. పెద్దసంసారులు ఎంత నిరాడంబరులైనా ఋణం చేసికోక తప్పిందికాదు. మానాన్నగార్ని మాత్రమేమి నిందించనూ. ఈఋణాలలో అనవసరమైనది కాని, షోకుకోసము కాని ఒక్కటీలేదు.

శేష

పోనీండి. ఈతక్కువధరకే భూములు వాళ్లమొహానతగలేస్తే మనకేమి మిగులుతుందో చూడండి.

పూర్ణచంద్రరావు

అల్లాతక్కువధరలుచూచినా వాళ్లు సర్వం గాకట్టుకుంటే పదెకరాలూ యీయిల్లుమిగల వచ్చునుకుంటూ.

శేష

ఆఖరు కిల్లు మిగిలినాచాలులెండి. నాకే నగలూ, పట్టుచీరలూ అక్కర లేదు. ఈ రాటమేచాలు. మీరు పిల్లలపోషవర్గానికి తెస్తూంటే యింట్లో గౌరవంగా తలదాచుకో వచ్చు.

పూర్ణచంద్రరావు

అంతే అన్నావు. ఏభయియకరాల సంసారులము తిండికి దైన్యపడవలసి వస్తోందా?

అని ఏడుపారంభించాడు. కళ్లకొలకుల్లో నుంచి నీరు గట్టుతెగినట్టుగా కారుతోంది. ఎగుపులువస్తున్నాయి.

అంతలో శేష దగ్గరకువచ్చి అతన్ని తన మృదువైన చేతులతో అదిమిపట్టుకొని "మీరల్లా అధైర్యపడకూడదు. ఈభారత దేశంలో ఏడుకోట్ల ప్రజలున్నారు. ఒకపూటకైనా తిండిలేనివాళ్లు అందులో మనమొకళ్ల మవుదాము. ఏమిటి శాశ్వతం? అన్నీ వదలుకొనిపోవాలి విశ్వపతిపిలుపువస్తే. ఈమాత్రాని కీవడ్డీవ్యాపారపు తోడేళ్లు మిడిసిపడు తున్నాయి."

సరిగ్గా ఆసమయంలోనే లేచి చంటిపిల్లాడు రోదనమారంభించాడు. "ఉండండి చూచి వస్తాను" అనివెళ్లింది.

పూర్ణచంద్రరావు

నాబతుక్కి పరమేశ్వరా! అప్పుడే యీ పిల్లల్ని కూడా యిచ్చేవెందుకు?

3

అది వట్టిదుర్దినం. చిటపటా చినుకుపడుతోనేవుంది. ఆకాశం మేఘావృతంగానేవుంది. వసారాగదిలోవున్న చింకిరిచాపమీద

చౌక్కా లేకుండా పాపయ్య బొజ్జ నిమురుకుంటూ "యిదిగో సర్వయ్యా! మంచి వుపాయందొరికిందోయ్. ఏమిటంటావా, వినుమరి చెపుతాను. బొత్తిగా ఆండ్రెబ్బసాగిందిలే ప్రజలికి. ఈమధ్యదోచేసారుగా ఒకడిదగ్గిర తెలియకుండా యింకొకడిదగ్గిర నోట్లమీద డబ్బు. ధరపడిపోయింది. వెధవలై పోయారు. చూసావు మనకీ చౌకగా అవునన్నధరకి భూములు రాయించుకోడానికిదే మంచిసమయం. ఇప్పుడు మనబాకీకింద లింగయ్య, మంగయ్య, సంగయ్య, శాకీలకిందా పూర్ణచంద్రరావు ఆస్తీయిల్లుకూడా రాయించుకున్నామా? ఇంకా అయిదువందలకో నోటుందికాదుటోయి. మధ్య వెధవలంతా అవిమానుక్కోమన్నారు.

సర్వయ్య

ఇకఆస్తి ఏదండీపాపం?

పాపయ్య

అదిగో, అదేపనికిరాదు. నీదగ్గర వెధవమెత్తతనం చాతకానిజాలి. మాదగ్గిర గుమస్తాగా వుండాలంటే బాకీవాళ్ళ కాట్లకుక్కలకిమల్లేకఱచి మరీతీసుకురావాలి. వెఱ్ఱివాడా! వాళ్ళని ఋణాలెవ్వరు చేయమన్నారు? ఒళ్ళు తెలియక తగలేసుకుంటే అప్పులుచేస్తే యెక్కడకిపోతాయిమరి. దానికేమిగాని పాపం, సర్వయ్యా! పూర్ణచంద్రరావెక్కడున్నాడోయి? నావుపాయం చెపుతానుకాని.

సర్వయ్య

దాసుగారింటో పక్కవేపున అద్దెకున్నాడు.

పాపయ్య

నేను ఎరస్టువారంటుకి పెట్టానులే. ఆర్డరు పడిందిలే. నువ్వూనేనూకలిసి బంట్రౌతును తీసుకువెడదాము. ఈవేళ ముసురుకాదూ. ఎక్కడికీపోడు. ఇంటిదగ్గిరేవుంటాడు. సుళువుగా పట్టుకోవచ్చు.

సర్వయ్య

ఆస్తిలేనప్పుడు ఖైదులో పెడితేమాత్రం లాభమేమిటి?

పాపయ్య

వెఱ్ఱివాడా! లాభమేమిటా? పెళ్ళాము మెడలో గొలుసుంది, చేతికిగాజులున్నాయి. మొగుడిని ఖైదులోపెడితే పెళ్ళామావస్తువులమ్మి విడిపించుకుంటుంది. కనక మనమా పనిచేస్తేమనడబ్బూ మనకొస్తుంది. వాళ్ళకీ యిక పేచీలుండవు.

సర్వయ్య (తనలో)

ఆరి నిన్నుతగలెయ్యా! (పైకి) చిత్తము.

పాపయ్య

సరే. తే యికవెడదాము.

౪

ఒకచిన్న పెంకుటింటివసారా పక్కదొడ్లో చాపమీదకూచున్నాడు పూర్ణచంద్రరావు. కళ్ళలోనుంచి వెలితి చూపులొస్తున్నాయి. నేత్రకోణాలు గుంటలుపడ్డాయి. మొఖం వైవర్ణ్యంపొందింది. చేతిలో ఒకచిన్న సీసావుంది.

కొంతసేపటికిట్లాని తర్కించుకోడం మొదలువెట్టాడు. "నిజమే అయివుంటుంది. వారంటుకెన్నాళ్ళని దాగుతాను. ఇదివరకే సగము చచ్చివున్నాను. ఇక ఎరస్టుచేసి వీధులమ్మట తీసికెడ్తారు. అంతబతుకుబతికి అల్లాటి

తండ్రికిబుట్టి ఛీ! ఎందుకీబ్రతుకు? దానితో చెపితే నగలమ్మి తీర్చమంటుంది. ఇకనాముద్దు కూన పాపరూ, పాపరుబిడ్డానా? నాకేనా యీదైన్యం? నా కీపిరికితనం ఎందుకు? ఈ విషద్రావకం తాగితే అన్నీ వదలుతాయి."

అట్లా తర్కించుకొంటూవుండగా—శేష అంట్లగిన్నెలుతోముకుంటూ ఆబురదచేతితో పిల్లాణ్ణిచంకని వేసికొనివచ్చి అక్కడ కూల వేసి 'వీడినిచూద్దురూ, పనికడ్డమైనాడు' అని వదలిపెట్టి వెళ్ళిపోయింది. పూర్ణచంద్రరావు మాట్లాడలేదు. పిల్లవాడిని చేరతీయలేదు. భార్యవంక అట్లేచూస్తోవుండిపోయాడు. నా భార్య దాసీదైపోయిందే అనుకున్నాడు.

ఇంతలో చంటిపిల్లాడు "బాబా! తీతా నాకి"మ్మని లాగనారంభించాడు. "నీకు కాదు నాన్నా! నాకే మహాపాపికి, నిర్భాగ్యుడికి" అని అందులో విషద్రావకం తాగేసి ఆసీసా విసరికొట్టాడు.

ఆవిషద్రావకం తాగితాగడంలో గొంతుకు మండిపోయింది. కెవ్వనకేకెట్టి కూలిపోయాడు. కళ్లు గవ్వలై తిరిగిపోయాయి. చంటిపిల్లవాడు పెద్దపెట్టున ఏడుపారంభించాడు.

శేష పాపం పరుగుపరుగునవచ్చి చూచేసరికి ప్రళయప్రదర్శనం కనపడింది. భర్త ప్రాణంపోయింది. ఎంతపరీక్షించినా వూపిరి లేదు. అంతలో ఎదురుగుండావచ్చి పాపయ్య అతనిగుమస్తా, యిద్దరు బంట్రోతులు ఎరస్టు వారంటు-యమధర్మరాజు దూతలల్లే నుంచున్నారు.

వాళ్ళనిచంటిపిల్లాడు చూచి 'బూచాల్లే' అని తల్లికాళ్లలోపడ్డాడు. శేష స్తంభితురాలై నిలబడిపోయింది.

చిల్కా!

శ్రీమతి తల్లాప్రగడ విశ్వసుందరమ్మగారు

ఒకచెట్టు మీద ఒప్పైన గూటిలో
వసియించు చుండగా చిల్కా!
పాడువేడిగాడ్పు బాధింప నెంతయో
పరితాప మొందితిని చిల్కా!
చిగురుటాకులతోడ గుబురుగా
చిన్నమావి నీడజేర
ఆదరముజూపి సమ్మోదమ్మునొడగూర్చె
ఆనందమాయెనే చిల్కా!
గున్నమావినీడ గూర్చిండియుండగా
పున్నమ వెన్నెలగాయ
చిన్నిసంద్రమ్ము నా ఎన్కా యలలు రేగి
యుత్సాహ మొదవించె చిల్కా!
అంతలోనె యెంతొ సంతోషమలమగా
అదియేమి కర్మమోగాని
పంతము బూని యాషాడువిధి మనమున
సంతాప మొదవించె చిల్కా!
గాఢపరితాపమున వాడుబారిన మనసు
వశము తప్పియుండగాను
కఠినభాషల నెంతొ గారింతురే పరులు
కలతబడి నవయగా చిల్కా!
ఎన్నాళు లీరీతి యేహ్యజీవితమునా
వెళ్లబుత్తును దినములెంచి
కొన్నాళ్ల కయిన నా తెన్ను త్రోవ తెల్పి
కన్ను దెరిపింపవా చిల్కా!
మోసులెత్తి యాసకాసి పుష్పించగా
గాసి బాసి సుఖము జెందా
నే నాసించుచుండగా నాస
దీరక సుఖంబదియేల గల్గునే చిల్కా!